తెలంగాణలో వానలే వానలు..



వివరాలు 3లో..

# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం 21, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## 10,000 కోట్ల భూమికి ఎసరు..



- హిల్ట్ ముసుగులో భూములు హాంఫట్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** హైదరాబాద్ వెస్ట్ సిటీలోని రాయదుర్గంలో ఇటీవల టీజీఐఐసీ నిర్వహిం చిన వేలంలో ఎకరా రూ.267 కోట్ల ధర పలికిన విషయం తెలిసిందే. సరిగ్గా ఆ భూములకు ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలో, పాత ముంబై హైవేను అనుసరించి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు ఆనుకొని ఉన్న భూములు.. అంటే ఎకరా ధర కనీసంగా రూ.200 కోట్లయినా పలుకుతుంది. అలాంటి భారీ విలువ ఉన్న రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి గ్రామ పరిధిలో అల్యూమినియం ఫ్యాక్టరీకి చెందిన భూములు ఉన్నాయి. గ్రామ పరిధిలోని 95-97, 99/1, 99/2, 101/1, 101/2, 101/3 సర్వేనంబర్లలో 100.35 ఎకరాల భూమి కిషన్‌చంద్ అనే వ్యక్తి డైరెక్టర్‌గా ఉన్న 'ది కమర్షియల్ అండ్ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ లిమిటెడ్' కంపెనీ పేరిట ఉన్నాయి. ఆ భూముల్లోని 45 ఎకరాలను కేరళలోని కుందరలో ఉన్న 'ది అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్' కంపెనీ కి విక్రయించారు. ఈ మేరకు 06.03.1961న బేగం పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తయింది. ఆ సమయంలో ఎకరా సుమారు రూ.8,111 చొప్పున 45 ఎకరాలకు గాను రూ.3,65,000 'ది అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ' చెల్లించింది. ఆ తర్వాత అందులో అదే కంపెనీ పేరిట అల్యూమినియం ఉత్పత్తుల ప్రక్రియ కొనసాగింది. ఇదీ మలి అడుగు గోపన్‌పల్లిలోని ఆ అల్యూమినియం కంపెనీ మంచిగానే నడుస్తుండగా, ఉత్పత్తితోపాటు పదుల సంఖ్యలో జనానికి ఉపాధి కూడా లభించింది. దీంతో ఉత్పత్తిని పెంచేందుకు తమ కంపెనీని విస్తరించాలనుకొన్న ఆ యాజమాన్యం తమకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని 1966లో అప్పటి ప్రభు త్వాన్ని కోరింది. పారిశ్రామికాభివృద్ధి కోణంలో అప్పటి ప్రభుత్వం భూముల కేటాయింపునకు అంగీకరించింది.ఈ మేరకు అప్పటికే కంపెనీ ఉన్న 45 ఎకరాలకు తోడు మరో 53.14

మిగతా 3లో..

## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

- దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దే...
- ఆ భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం
- విషప్రచారాన్ని నమ్మొద్దు :
- రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పునరుద్ఘాటించారు. పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను

మిగతా 3లో..

# కేసీఆర్‌ది రైతు పాలన.. రేవంత్‌ది రాక్షస పాలన

- రేవంత్.. ఎల్ నినో కంటే డేంజర్
- ఆరు గ్యారెంటీలు అమలుచేసే దాకా నిన్ను వదిలిపెట్టం
- పాలన చేతగాకపోతే రాజీనామా చేసి క్షమాపణ చెప్పు
- దమ్ముంటే ఎంపీ చామల కిరణ్, ఎమ్మెల్యే ఐలయ్య చర్చకు రావాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌లో చేరిన 2వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలు



**యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 20 :** ఎల్ నినో కంటే సీఎం రేవంత్‌రెడ్డి డేంజర్ అని.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పక్కనపెట్టి ప్రజలను మోసం చేస్తామంటే ఊరుకోబోమని, అమలుచేసేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. పాలన చేతగాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు.ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని మోటకొండూర్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేశ్ యాదవ్, అనంతుల శోభన్‌బాబు ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి

మిగతా 3లో..

# పంటలు ఎండబెట్టడం నేరం

- కేసీఆర్ హయాంలో వచ్చిన నీళ్లకు ఇప్పుడేమైంది?
- నాగార్జునసాగర్‌లో నీళ్లున్నా సాగుకు ఎందుకు ఇవ్వడం లేదు
- ఇందిరమ్మ రాజ్యమంటే కోతలు, నీళ్లు ఇవ్వకపోవడమేనా?
- నల్లగొండకు పట్టిన శని జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలే
- ఎండిన పొలాలను, లాగ్‌బుక్స్‌ను పరిశీలించిన జగదీశ్‌రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్20 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రైతుల పొలాలను ఎండబెడు తున్నది.. ఇది కేవలం నిర్లక్ష్యమే కాదూ... నేరపూరిత చర్య అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌నినో అని చెప్తున్నా... కృష్ణా నదీలో ఎగువ నుంచి వరద వచ్చింది. శ్రీశైలంలో నీళ్లు ఉన్నాయి... సాగర్‌లోనికి వచ్చాయి.. అయినా ఎల్ఎల్‌బీసీ మోటర్లు నడిపి ఎందుకు చెర్వులు, కుంటలు నింపడం లేదు..?, ఎందుకు పొలాలను ఎండబెడుతున్నారు..? అని ప్రశ్నించారు.కేసీఆర్ హయాంలో పదేండ్లు సమృద్ధిగా నీళ్లు... నిరంతరం కరెంట్‌తో పంటలు పండించుకున్న రైతులు.. ఇప్పుడు ఎండుతున్న పంటలు చూసి కన్నీళ్లు పెడుతున్నరని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్ మండలం తేలకంటిగూడెంలోని ఏఎమ్ఆర్పీ ఆయకట్టు పరిధిలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తిమ్మారెడ్డిగూడెం సబ్‌స్టేషన్‌లో లాగ్‌బుక్ పరిశీలించి కరెంట్ కోతలపై ఆరా తీశారు. అనంతరం పంట ఎండిపోయిన రైతులు బైరగోని పెద్దలింగయ్య, యాదయ్యలకు చెందిన నాలుగు ఎకరాల వరి పొలాలను పరిశీలించిన

మిగతా 3లో..

## ఆధార్ అథెంటిఫికేషన్ తప్పనిసరి..




- లేదంటే వంటగ్యాస్ సబ్సిడీ కట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** ఆరు గ్యారెంటీల్లో భాగంగా రాష్ట్రంలోని పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500కే వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రమంగా ఆ పథకానికి తూట్లు పొడుస్తున్నది. అందులో భాగంగా ఇప్పుడు మరో ఎత్తుగడ వేసింది. ఆధార్ అథెంటికేషన్ ఉన్న వినియోగదారులకే రాయితీ వర్తిస్తుందని మెలిక పెట్టింది. గుట్టు చప్పుడు కాకుండా జూలై నుంచే సబ్సిడీ నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచే యడం లేదని తెలుస్తున్నది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలమంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల పథకానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం వివిధ కారణాలను సాకుగా చూపి లబ్ధిదారుల సంఖ్యను సగానికిపైగా తగ్గించింది. ప్రస్తుతం 42.90 లక్షల మందికే సబ్సిడీ

మిగతా 3లో..

## సర్కార్ మెడలు వంచిన పాలిటెక్నిక్ పోరు




- స్కిల్ వర్సిటీలో విలీన నిర్ణయం సర్కార్ వెనక్కి
- శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపునకు బ్రేక్
- పాత పద్ధతిలోనే పాలిటెక్నిక్ విద్య, మార్పుల్లేవ్
- ముఖ్యమంత్రి రేవంత్‌కు కేకే కమిటీ నివేదిక
- విలీనాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటన

వివరాలు 2లో..

## నేను బహుజనుల బాణాన్ని..



- సీఎం రేవంత్ అడ్డాలో TRS చీఫ్ కవిత సవాల్

3లో..

## ఎంజీఎంహెచ్‌లో కూలిన పైకప్పు..

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- వెంటనే మొత్తం వార్డును ఖాళీ చేయించిన వైద్యాధికారులు

2లో..

# ప్రైవేట్ భూముల్లోకి కాంగ్రెస్ లీడర్లా..

- ఫామ్‌హౌస్‌లు ఏమైనా టూరిస్ట్ కేంద్రాలా ?
- భూదోపిడీ ఆధారాలు ఉంటే వెల్లడించండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 20 :** ప్రైవేట్ భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారని, ఫామ్‌హౌస్‌లు ఏమై నా టూరిస్ట్ కేంద్రాలా అంటూ కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్ నగరపాలకసంస్థ కార్యాలయ ఆవరణలో ఆదివారం మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల ఫామ్‌హౌస్ సందర్శన పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఫాంహౌస్ భూములను సందర్శిస్తే అర్థం చేసుకోవచ్చుగానీ, అధికారం కాంగ్రెస్ చేతుల్లోనే ఉంది కదా అని నేతలు ఫామ్ హౌస్ భూముల సందర్శనకు వెళ్లడం ఏందని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లో ఒకవేళ సరార్ భూములుంటే తక్షణమే స్వాధీనం చేసుకొనే హకు ప్రభుత్వానికి ఉన్నదని తెలిపారు.బీఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్ల భూదోపిడీ చేసినట్లు ఆధారాలుంటే ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలకు భయపడే కాంగ్రెస్ అనర్హత కేసులో స్టే కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిందని విమర్శిం చారు. ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌ను రాజకీయ నిమజ్జనం చేయడం తథ్యమని జోస్యం చెప్పారు. ఉప ఎన్నికల్లో పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను జనం అసహ్యించు కుంటున్నారని పేర్కొన్నారు. దానం నాగేందర్ తనను ఖైరతాబాద్ వినాయకు డితో పోల్చుకోవడం ఆశ్చర్యం కలిగిస్తున్న దని, అయితే వినాయకుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే బెటర్ అని సూచించారు. 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని, ఆ సమస్యను పరిషరించకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు




- పశ్చిమ బెంగాల్‌లో 38.2 లక్షల అప్పీళ్లలో 22.2 లక్షలు తొలగించిన ఓటర్లవే
- విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చిన ట్రిబ్యునళ్లు
- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా తొలగించిన ఓటర్లలో 82 శాతం మంది తమ పేర్లను తిరిగి చేర్చాలని అప్పీల్ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం.. సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎన్నికల జాబితా నుంచి పేర్ల తొలగింపు, తిరిగి చేర్పు ప్రక్రియపై కొనసాగుతున్న న్యాయపరమైన పరిశీలనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రత్యేక ట్రైబ్యునళ్ల ముందు మొత్తం 38.2 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిలో 22.2 లక్షల అప్పీళ్లు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన నిర్ణయాలకు వ్యతిరేకంగా దాఖలైనవే. సవరణ ప్రక్రియలో తొలగించి విచారణకు

మిగతా 3లో..

## ఎల్ నినో కంటే ఎల్ కాంగో ప్రమాదకరం

- రేవంత్ పాలనలో రాష్ట్రం అతలాకుతలం
- కల్లుతాగిన కోతుల్లా కాంగ్రెస్ ఎంపీల తీరు: ఆర్ఎస్పీ
- ప్రైవేట్ ఆస్తులపై దాడులు సిగ్గుచేటు
- పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే డైవర్షన్ రాజకీయాలు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి300 కోట్ల విలువైన భూకబ్జా
- రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు
- చోద్యం చూస్తున్న పోలీస్ బాస్
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం

వివరాలు 3లో..

## శ్రీనివాసరావుకు 'సృజనగాథ' లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్



హైదరాబాద్, సెప్టెంబర్ 20: సృజనాత్మక రచనారంగంలో విశేష కృషి చేసిన ప్రముఖ రచయిత డాక్టర్ కే శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మక 'సృజనగాథ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురసారం' లభించింది. అండమాన్ నికోబార్ ద్వీపంలోని పోర్ట్ బ్లెయిర్‌లో 19నుంచి 26 వరకు జరుగుతున్న 26వ అంతర్జాతీయ హిందీ సదస్సు వేదికగా ఆయనకు అదివారం ఈ అవార్డును అం దజేసి ఘనంగా సతరించారు. ఈ సందర్భంగా సృజనాత్మక రంగంలో ఆయన సుదీర్ఘకాలంగా అందిస్తున్న సేవలను నిర్వాహకులు కొనియాడారు. హిందీ భాషా సాహిత్యాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతోపాటు విశిష్ట సాహితీవేత్తలను గౌరవించడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. సాహిత్యం, సృజనాత్మక రచనలు సమాజాన్ని సున్నితంగా తీర్చిదిద్ది భాషా సంస్కృతుల వికాసానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. డాక్టర్ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనకు పురసారం అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సదస్సులో డాక్టర్ జయప్రకాశ్ మానస్, డాక్టర్ అజయ్ పాఠక్, డాక్టర్ సవిత్తా మోహన్ పలువురు భాషావేత్తలు, పాల్గొన్నారు.

## బీసీ ఉద్యమానికి సాహిత్యరంగం పునాది వేయాలి



- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ గౌరీశంకర్
- ఎస్‌వీకేలో 'వెంటాడే కలాలు' పుస్తక రజతోత్సవ సభ


హైదరాబాద్, సెప్టెంబర్ 20: బీసీ ఉద్యమానికి సాహిత్య రంగం బలమైన భావజాల, సాంస్కృతిక పునాది వేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, 'వెంటాడే కలాలు' సంపాదకుడు జూలూరు గౌరీశంకర్ పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 'వెంటాడే కలాలు' పుస్తక రజతోత్సవ సభలో ఆయన కీలకోపన్యాసం చేస్తూ.. బీసీల చేతుల్లోనే సమాజ నిర్మాణం జరిగినా, వారి చరిత్రను ఇతరులు రాశారని, ఇకపై బీసీలు తమ చరిత్రను తామే రాసుకోవాలని సూచించారు. బీసీ సాహిత్యం ప్రశ్నించే దశకు, అకడి నుంచి ప్రత్యామ్నాయ సామాజిక దృక్పథాన్ని ప్రతిపాదించే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. రాజ్యాధికారమే పరమావధిగా ప్రజా ఉద్యమాలకు ఊతమిచ్చేలా ప్రజలను చైతన్యపరచడమే బీసీ రచయితలు, మేధావుల కర్తవ్యమని జూలూరు స్పష్టంచేశారు.

## బీసీఐ సభ్యుడిగా కిరణ్‌కుమార్ బాధ్యతలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : తెలంగాణ నుంచి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సభ్యుడిగా ఎన్నికైన జీ కిరణ్‌కుమార్ ఆదివారం న్యూఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బీసీఐ చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా, పలువురు సభ్యులు హాజర య్యారు. తెలంగాణ నుంచి పదవీకాలం ముగించుకున్న బీసీఐ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు కిరణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేటకు చెందిన కిరణ్ కుమార్ 25 ఏండ్ల నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ లీగల్ సెల్‌లో కీలకపాత్ర పోషిస్తున్న ఆయన గతంలో నాంపల్లిలోని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ (ఎంసీసీబీఏ) ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పని చేశారు. బీసీఐ సభ్యుడిగా తెలంగాణ న్యాయవాదుల సమస్యలను జాతీయస్థాయిలో ప్రస్తావించడంతో పాటు న్యాయవాదుల సంక్షేమం, హకుల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానని కిరణ్ కుమార్ తెలిపారు.

## పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?



- నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలి : మాజీ ఎమ్మెల్యే బొల్లం
- కరివిరాల సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 20: విద్యుత్తు సరఫరా సక్రమంగా లేకపోవడంతో బోరుబావుల కింద వేసిన పంటలు ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వ పట్టించుకోవడంలేదని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ధ్వజమెత్తారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కరివిరాల విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కరెంటు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నదని మండిపడ్డారు. విద్యుత్తు సరఫరా సక్రమంగా లేక బోర్లు, బావుల కింద వేసుకున్న పంటలు కండ్ల ముందే ఎండుతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటలు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ మూడు పంటలకు నీళ్లు ఇచ్చి రైతును రాజును చేస్తే ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంటలను ఎండబెట్టి అన్నదాతలను అగచాట్లపాలు చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం దిగివచ్చి రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సర్కార్ మెడలు వంచిన పాలిటెక్నిక్ పోరు

- స్కిల్ వర్సిటీలో విలీన నిర్ణయం నుంచి సర్కార్ వెనక్కి
- శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపునకు బ్రేక్
- పాత పద్ధతిలోనే పాలిటెక్నిక్ విద్య, మార్పుల్లేవ్
- ముఖ్యమంత్రి రేవంత్‌కు కేకే కమిటీ నివేదిక
- విలీనాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటన




హైదరాబాద్, సెప్టెంబర్ 20: పాలిటెక్నిక్ విద్యార్థులు 38 రోజులుగా సాగించిన పోరాటం ఫలించింది. అధ్యాపకుల సహాయ నిరాకరణ ఉద్యమ సెగ తగలడంతో వెనక్కి తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం.. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీలు, శక్తి(కార్మిక)శాఖలో ఉద్యోగుల విలీనం చేయాలన్న నిర్ణయాలపై వెనక్కి తగ్గింది. పాలిటెక్నిక్ కాలేజీలు.. సాంకేతిక విద్యా పరిధిలో(ప్రభుత్వ) ఉంటాయని.. సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా మండలిలు యథాతథంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. డిప్లొమా కోర్సుల నిర్వహణలో ఎలాంటి మార్పు లేదని.. ఏఐసీటీఈ అంశాలు, పరీక్ష విధానాలు పాత పద్ధతిలోనే ఉంటాయని తెలిపింది. ఈ మేరకు ఆదివారం పాలిటెక్నిక్ జేఏసీ నేతలకు ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే కేశవరావు సమాచారం ఇచ్చారు. దీంతో పాలిటెక్నిక్ విద్యలో నెలకొన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. పాలిటెక్నిక్ విద్య విలీనం, జీవో 97పై ఉధ్రుతలూగిన విద్యార్థి ఉద్యమం నేపథ్యంలో ప్రభు త్వం ప్రభుత్వ సలహాదారు కేశవరావు అధ్యక్షతన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ తొలుత అధ్యాపక జేఏసీ నేతలతో చర్చించింది. శనివారం బషీర్‌బాగ్‌లో నిఎస్సీఈఆర్టీ ఆడిటోరియంలో విద్యార్థులతో చర్చలు జరి పింది. విద్యార్థులు పదులకొద్దీ ప్రశ్నలను కమిటీ ముం దుంచారు. వారు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వ పెద్దలు ఉక్కిరిబిక్కిరై సమాధానాలు చెప్పలేకపోయారు. పాలిటెక్నిక్‌ను ఇతర వ్యవస్థల్లో విలీనం చేస్తే కోర్సులు, పరీక్షలు, ఏఐసీటీఈ గుర్తింపు, ఉద్యోగుల భవిష్యత్తు, విద్యార్థుల ప్రయోజనాలపై స్పష్టతనివ్వాలని కోరారు. విద్యార్థులు పాలిటెక్నిక్‌ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, శక్తిశాఖలో విలీనం చేయడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని తేల్చిచెప్పారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే ఉద్యమాన్ని ఉధృతంచేస్తామని స్పష్టంచేసిన నేపథ్యంలో కేకే ఆదివారం సీఎంతో భేటీ అయ్యారు. ఓ సమగ్ర నివేదికను అందజే శారు. పాత విధానంలోనే కొనసాగించాలని, విలీనం ప్రతి పాదనను ఉపసంహరించుకోవాలని సూచించినట్టు సమాచారం.

## ఎంజీఎంహెచ్‌లో కూలిన పైకప్పు..

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- వెంటనే మొత్తం వార్డును ఖాళీ చేయించిన వైద్యాధికారులు



వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 20 : దవాఖాన స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు రోగులు సహా 8 మందికి గాయాలైన ఘటన వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో ఆదివారం జరిగింది. ఉదయం 9 గంటల సమయంలో ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడి సీలింగ్ పెద్ద శబ్దంతో ఒక్కసారిగా కింద కూలిపోయింది. ఈ ప్రాంతంలో పక్షవాతంతో చికిత్స పొందుతున్న మస్తాన్, సారయ్య, ఆయాసంతో చికిత్స పొందుతున్న స్వప్నకు తీవ్ర గాయాలయ్యాయి. అటెండెంట్‌లు ఓంకార్, ఎల్లమ్మ, భిక్షపతి, వార్డును శుభ్రం చేస్తున్న శానిటేషన్ ఉద్యోగులు పుష్ప, సౌందర్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే స్పందించిన హాస్పిటల్ సిబ్బంది క్షతగాత్రులకు వైద్యసేవలు అందించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ రాంకుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి గాయాపాలైన వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను మరో వార్డుకు తరలించి, వార్డును ఖాళీ చేయించారు. ఊడిపడిన కాంక్రీట్ ముక్కలు నేరుగా వ్యక్తులపై పడిఉంటే ప్రాణహాని కలిగి ఉండేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

## ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ ఖేల్ ఖతం

- పులిలా గాండ్రించి పిల్లిలా మారిన దానం నాగేందర్
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 20: రాష్ట్రంలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇక కాంగ్రెస్ పని అయినట్టేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు మొట్టికాయలు వేయగానే పులిలా గాండ్రించిన దానం నాగేందర్, 24గంటలు తిరుగకముందే పిల్లిలా సుప్రీంకోర్టు మెట్లెక్కారని విమర్శించారు. ఫైటర్‌ను అంటూనే సుప్రీం కోర్టులో పిటిషన్ ఎందుకు వేశారో దానం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ మొత్తం డ్రామా వెనుక ఉన్న అసలు సూత్రధారి సీఎం రేవంత్‌రెడ్డేనని స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక వస్తే కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవుతుందనే భయంతోనే దానం నాగేందర్‌ను పావుగా వాడుకుంటూ కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి తన పరిపాలనపై నమ్మకం, ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే ఖరీదైన లాయర్ల వెనుక దాకోవడం మానేసి వెంటనే ఖైరతాబాద్ ఉప ఎన్నికను నిర్వహించాలని సవాల్ విసిరారు. అకడ దానం నాగేందర్‌ను నిలబెట్టినా, రేవంత్‌రెడ్డి స్వయంగా పోటీ చేసినా బీఆర్ఎస్ గెలుపు తథ్యమని స్పష్టంచేశారు. రేవంత్ సరార్ తోలు బొమ్మలాటకు చరమగీతం పాడేందుకు ఖైరతాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తేల్చి చెప్పారు.

## 215 మంది ఎర్రవల్లి రైతులకు నోటీస్‌లు



గ్రామ పంచాయతీ వద్ద ఒక్కొక్కరికి నోటీసులు

గజ్వేల్, సెప్టెంబర్ 20: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలోని ఎర్రవల్లిలో సర్వే నంబర్ 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. గ్రామ పంచాయతీ వద్ద ఒక్కొక్కరికి నోటీస్‌లను ఇచ్చారు. 215 మంది రైతులకు విడతలవారీగా నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే గ్రామానికి చెందిన సుమారు వంద మందికిపైగా రైతులకు అందజేశారు. నోటీసులు అందుకున్న రైతులు సోమవారం నుంచి కొనసాగనున్న సర్వేలో ఆధారాలతో పొజిషన్ వద్దకు వచ్చి సర్వే అధికారులకు హద్దులు చూపించి సహకరించాలని కోరారు. మొత్తం 388.05 ఎకరాల విస్తీర్ణం ఉండడంతో నాలుగు విడతలుగా సర్వే చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

## మృతదేహాన్ని పీక్కుతిన్న ఎలుకలు



- వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానలో దారుణం
- ఫ్రీజర్లు లేకపోవడంతోనే ఘటన

హైదరాబాద్, సెప్టెంబర్ 20: పోస్టుమార్టం కోసం భద్రపరిచిన శవం కన్ను పైభాగాన్ని ఎలుకలు పీక్కుతిన్న అమానుష ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఏరియా వైద్యశాలలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన గారె వీరయ్య(58) శనివారం రాయపర్తి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు కేసు విచారణలో భాగంగా వర్ధన్నపేట ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. డ్యూటీ వైద్యులు సమయం దాటిపోవడంతో వెళ్లిపోయారు. దీంతో పోలీసులు సంగెపువాగు వద్ద ఉన్న పోస్టుమార్టం గదిలో శవాన్ని భద్రపరిచారు. పోస్టుమార్టం గదిలో విద్యుత్, ఫ్రీజర్, ఇతర వసతులు లేకపోవడంతో రాయపర్తి పోలీసులు సిబ్బందితో మాట్లాడి వీరయ్య శవాన్ని బల్లపై ఉంచి గదికి తాళం వేయించి వెళ్లిపోయారు. పోస్టుమార్టం గదిలో వసతులు లేవని చెప్పినా వినకుండా రాయపర్తి పోలీసులు వేరే అవకాశం లేకపోవడంతో శవాన్ని పీఎం గదిలో ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం ఉదయం 11 గంటలకు వైద్యులు వీరయ్య శవానికి పోస్టుమార్టం చేసేందుకు గది తాళం తీసి వెళ్లి శవాన్ని పరిశీలించడంతో కన్ను పైభాగంలో ఎలుకలు పీక్కొని తిన్నట్టు కనిపించింది. ఈ దృశ్యాన్ని స్థానికులు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు అలాట్‌మెంట్ లెటర్లు

### నేటి నుంచి వాట్సాప్, ఎస్సెమ్మెస్ ద్వారా అందజేత



హైదరాబాద్, సెప్టెంబర్ 20: ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ప్రాజెక్టుల కింద ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వం సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఫోన్ నంబర్లకు ఎస్సె మ్మెస్, వాట్సాప్‌తో పాటు టీజీహెచ్‌బీ వెబ్‌సైట్ ద్వారా అందజేయ నున్నది. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని హౌసింగ్ కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం గృహనిర్మాణ శాఖ మంత్రి శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో 480 ఫ్లాట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

BALAGAM TV
balagamtv100@gmail.com

## (మొదటిపేజీ తరువాయి)

## 10,000 కోట్ల భూమికి ఎసరు..

ఎకరాలను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కంపెనీని ఆనుకొని ఉన్న భూములను ప్రభుత్వపరంగా సేకరించే బాధ్యతను పరిశ్రమలు, వాణిజ్యశాఖకు అప్పగించింది. ఆ శాఖ అధికారికంగా ఏపీ భూసేకరణ చట్టం–1994 చట్టం ప్రకారం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసి.. సర్వేనంబరు 90 (14.12 ఎకరాలు), 91 (9.34 ఎకరాలు), 92 (9.13 ఎకరాలు), 93 (9.35 ఎకరాలు), 94 (10.00) సేకరిస్తున్నట్టు ప్రకటించింది. ఆ సమయంలో సంబంధిత రైతులకు పరిహారం కింద రూ.1,63,347 అవార్డును కూడా ప్రకటించింది. అంటే ఎకరాకు సుమారు రూ.3,073 మొత్తాన్ని రైతులకు ప్రభుత్వం చెల్లించింది. ఆ తర్వాత ఆ భూములను 'ది అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్' కంపెనీకి 22.02.1966న అధికారులు కంపెనీ యాజమాన్యానికి అప్పగించారు. ఇలా 45 ఎకరాలతో మొదలైన అల్యూమినియం ఫ్యాక్టరీ 98.14 ఎకరాలకు విస్తరించింది.'సనద్'లో స్పష్టమైన షరతులుఅధికారిక ధ్రువీకరణ పత్రమైన సనద్‌లో ప్రభుత్వం స్పష్టమైన షరతులు విధించింది. సాధారణంగా రిజిస్ట్రేషన్లు చేసే సమయలో సేల్‌డీడ్ అంటే అమ్మకపు డాక్యుమెంట్, అగ్రిమెంట్ డీడ్ అంటే ఒప్పంద పత్రం అని చేస్తారు. ఇదే క్రమంలో ప్రభుత్వం ఏదైనా కంపెనీకి భూములను షరతులతో అప్పగించే సమయంలో 'సనద్' రూపంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ద్వారా అప్పగిస్తుంది. అంటే సదరు భూములను అప్పగిస్తున్నట్టుగా అధికారికంగా ధ్రువీకరించేదే ఈ సనద్. ఈ నేపథ్యంలో 1966లో 53.14 ఎకరాలను అల్యూమినియం ఇండస్ట్రీస్‌కు అప్పగించిన ప్రభుత్వం 1967 సెప్టెంబర్ 8న సనద్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసింది. ప్రభుత్వం తరఫున అప్పటి పరిశ్రమలు, వాణిజ్యశాఖ డిప్యూటీ సెక్రటరీ సీబీ రావు ఆ డాక్యుమెంట్లపై సంతకాలు చేశారు. ఇందుకు గాను అల్యూమినియం ఇండస్ట్రీస్ కంపెనీ ప్రభుత్వానికి రూ.66 వేలు చెల్లించింది. కాగా, పారిశ్రామిక అవసరాల కోసం చేపట్టిన ఈ భూ కేటాయింపునకు సంబంధించి అప్పటి ప్రభుత్వం డాక్యుమెంట్‌లోనే స్పష్టమైన షరతులు విధించింది.

## కేసీఆర్‌ది రైతు పాలన.. రేవంత్‌ది రాక్షస పాలన

ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ చేతగాని పాలనతో విసిగిపోయి ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని ముక్తకంఠంతో కోరుకుంటున్నారని చెప్పారు.దమ్ముంటే రాత్రిపూట సబ్‌స్టేషన్ల వద్దకు వచ్చి కరెంట్ సరఫరాపై బహిరంగ చర్చకు రావాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలో ఉండి, ప్రభుత్వ విప్ ఉన్నప్పటికీ వందలాది మంది సీనియర్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం.. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రాబోతుందనేందుకు స్పష్టమైన సంకేతమని పేర్కొన్నారు. మూడేండ్ల కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత ఎన్నికలు పెడితే ఎవరు గెలుస్తారని సర్వేలు చేస్తే.. మళ్లీ కేసీఆర్ రావాలనే చెబుతున్నాయని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఏ వర్గం చూసినా కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని ముక్తకంఠంతో చెబుతున్నారని పేర్కొన్నారు.కేసీఆర్‌ది రైతు పాలన అయితే రేవంత్‌రెడ్డిది రాక్షస పాలన అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 24గంటల కరెంట్ వస్తే ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 6–7 గంటలు మాత్రమే వస్తున్నదని మండిపడ్డారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ కేసీఆర్ రైతుబంధు ఆగకుండా ఇచ్చి రైతులను కాపాడారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాత్రం రైతుబంధు రూ.15వేలు ఇస్తానని చెప్పి, ఒక పంటకు రెండు ఎకరాలకే వేసి, ఇంకో పంటకు ఎకరానికే పరిమితం చేసి రైతులను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. సాక్షాత్తు యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టుపెట్టి దేవుణ్ని సైతం మోసం చేసిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని దెప్పిపొడిచారు. ఆగస్టు 15 డెడ్‌లైన్లు మూడు దాటిపోయినా ఇప్పటికీ సగానికి సగం మందికి రుణమాఫీ కాలేదని ధ్వజమెత్తారు. రైతు ఏ కారణం చేత చనిపోయినా వారం రోజుల్లో రూ.5 లక్షల బీమా ఇచ్చిన కేసీఆర్ ఎక్కడ.. ఆసలు రైతు బీమానే లేకుండా చేసిన రేవంత్‌రెడ్డి ఎక్కడ? అంటూ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో వడ్ల బస్తాకు 2 నుంచి 5కిలోల తరుగు తీస్తే.. అసెంబ్లీలో కూర్చొని తరుగు తీస్తే తోలుతీస్తానని డైలాగ్‌లు కొట్టిన రేవంత్‌రెడ్డి.. మిల్లర్లు, బ్రోకర్ల చేతుల్లో తోలుబొమ్మలా మారిపోయారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఇంటికే ఆటోలో యూరియా బస్తాలు వస్తే, నేడు యూరియా దొరకక రైతులు క్యూలో నిలబడే దుస్థితికి దాపురించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.

## పంటలు ఎండబెట్టడం నేరం



జగదీశ్‌రెడ్డి అందులోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తేలకంటిగూడెం చుట్టుపక్కలనే నాలుగు వందల ఎకరాల్లో ఇప్పటికే వరి పంట ఎండిపోయిందని తెలిపారు. ఈ ప్రాంతానికి కీలకమైన కనగల్ చెర్వును ఏఎమ్‌ఆర్పీ నీళ్లతో ఎందుకు నింపడం లేదో... పంటలను ఎందుకు ఎండబెడుతున్నారో మంత్రి కోమటిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కరెంట్ కోసం రైతులు నిత్యం రోడ్డెక్కుతున్న పరిస్థితికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని కోరారు. ఎల్‌నినో పేరు చెప్పి మంత్రులు తప్పించుకుంటున్నారని మండిపడ్డారు.కేసీఆర్ హయాంలో 21వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధిస్తే.. ప్రస్తుతం ఎందుకు 19వేల మెగావాట్ల ఉత్పత్తి దాటడం లేదని నిలదీశారు. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి పవర్ ప్లాంట్లల్లో విద్యుత్తు ఉత్పత్తి యూని ట్లను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో బొగ్గు నిక్షేపాలు బాగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఇస్తున్నప్పటికీ తెలంగాణకు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని కోరారు. రైతులు ఏడు గంటల కరెంట్ కూడా సక్కగా వస్తలేదని చెప్తున్నారని, సబ్‌స్టేషన్లలో లాగ్ బుక్స్‌ను పరిశీలిస్తే అదే విషయం స్పష్టమైందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం, పాత రోజులు తేస్తామంటే పొలాలు ఎండబెట్టుడు... కరెంటు ఇవ్వకపోవడమేనా అని ప్రశ్నించారు.

## ఆధార్ అథెంటిఫికేషన్ తప్పనిసరి..

వర్తింపజేస్తున్నది. వారిలో కేవలం 20 లక్షల మందికి మించి సబ్సిడీ నగదు జమకావడంలేదన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఎంపీడీవోలను అడిగితే గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించాలంటూ చేతులు దులిపేసుకుంటున్నారని, గ్యాస్ ఏజెన్సీలను సంప్రదిస్తే తమకేమీ తెలియదంటున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలోని దరఖాస్తుదారుల్లో 18% మందికే రాయితీపై సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. మిగిలిన 82% మందికి మొండిచెయ్యి చూపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితులు ఉన్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం నిరుడు జనవరి నుంచి ఈ ఏడాది జూలై వరకు కొత్తగా 11.27 లక్షల మందికి రేషన్‌కార్డులు మంజూరు చేసింది. వీరిలో 5 లక్షల మందిని సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులుగా గుర్తించింది. కానీ, వీరికి ఎప్పటి నుంచి సబ్సిడీ వర్తింపజేస్తుందో తెలియడం లేదు. ఇప్పటికే తూతూ మంత్రంగా సబ్సిడీ గ్యాస్ స్కీమ్‌ను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కొత్త రేషన్‌కార్డుదారులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తుందా అన్నది అనుమానాస్పదంగా మారింది.

## ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంలో కీలక గణాంకాలు

ఉంచిన 27 లక్షల మంది ఓటర్లతో పోలిస్తే ఇది సుమారు 82 శాతానికి సమానం. మరోవైపు, ఓటర్లను జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ కనీసం 16.1 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. ఈ అప్పీళ్లను ఎవరు దాఖలు చేశారనే విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టంగా వెల్లడించలేదు. మొత్తం 38.2 లక్షల అప్పీళ్లలో సుమారు 1.2 లక్షల కేసులను మాత్రమే అప్పటికి ట్రైబ్యునళ్లు పరిష్కరించాయి. అంటే మొత్తం అప్పీళ్లలో 3.1 శాతం కేసులపై మాత్రమే నిర్ణయం వెలువడింది. ఏప్రిల్‌లో ట్రైబ్యునళ్లు అప్పీళ్ల విచారణ ప్రారంభించాయి. కోర్టుకు సమర్పించిన అనుబంధ గణాంకాల ప్రకారం.. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93 శాతం కేసుల్లో ఓటర్లను తిరిగి ఎన్నికల జాబితాలో చేర్చారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టారు. ఫిబ్రవరిలో విడుదలైన తుది జాబితాలో తొలుత 61 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు చేర్చబడలేదు. అనంతరం అనుబంధ జాబితాలు, విచారణ ప్రక్రియ ద్వారా సుమారు 60 లక్షల అనుమానాస్పద, పెండింగ్ కేసులను పరిశీలించే ప్రక్రియ కొనసాగింది. ఏప్రిల్ 6 నాటికి సుమారు 91 లక్షల మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయని నివేదికలు పేర్కొన్నాయి. ఇది సవరణ ప్రారంభానికి ముందు ఉన్న పశ్చిమ బెంగాల్ మొత్తం ఓటర్ల సంఖ్యలో దాదాపు 11.9 శాతం. దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తొలగింపుల ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడిందా అనే అంశంపైనా పలు విశ్లేషణలు వెలువడ్డాయి.

# నేను బహుజనుల బాణాన్ని..

- సీఎం రేవంత్ అడ్డాలో TRS చీఫ్ కవిత సవాల్



**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** తనను బీఆర్ఎస్ వదిలిన బాణమని కొంతమంది, కాంగ్రెస్ బాణం అంటూ మరికొంతమంది చేస్తున్న విమర్శలపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని స్పష్టం చేశారు. బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ తో అయినా కొట్లాడేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ' లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్, మోదీలతో పోరాటం చేసి చూపిస్తానని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరి మద్దతు లేకుండా ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని తెలిపారు. ఇన్నాళ్లు అయ్యల పాలనలో ఒరిగిందేమీ లేదని ఇక తెలంగాణలో మాతృస్వామ్యం తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ తెచ్చుకున్న తర్వాత బీఆర్ ఎస్ కు, కాంగ్రెస్ అవకాశం ఇస్తే చేసేందేమీ లేదన్నారు. తనకు అవకాశం ఇస్తే ఒక తల్లిలాగా ఆలోచించి పాలన సాగిస్తానని తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు కూడా డబ్బులు అడుగుతున్నారని కవిత తెలిపారు. ఇప్పటికీ నీళ్లు రాని ఎన్నో గ్రామాలు ఉన్నాయని, రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆయన తీసుకొచ్చిన ఇంజనీరింగ్ కాలేజ్ మళ్లీ వెనక్కి వెళ్లిందన్నారు. గట్టు, కేటిదొడ్డు మండలాల్లో అఫ్ఘనిస్తాన్ తో సమానంగా అక్షరాస్యత ఉందని.. అందుకు సీఎం సిగ్గుపడాలన్నారు. విద్యా శాఖ మంత్రిగాను ఉన్న ముఖ్యమంత్రి రెండేళ్లలో పరిస్థితి మార్చాలని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజలు కాంగ్రెస్ కు 13 సీట్లు ఇస్తే ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి, ఇందిరమ్మ ఇండ్లలో డబ్బుల దందా చేస్తున్నారని కవిత విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోని ఈ కాంగ్రెస్ పార్టీని గద్దె దించాలని కోరారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితిపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా, కరెంట్, నీళ్లు, రైతు భరోసా, మద్దతు ధర ఇలా ప్రతి దానికి రైతులు బాధ పడే పరిస్థితి వచ్చిందన్నారు. అధికారుల కాళ్లపై పడి రైతులు వేడుకుంటున్న సంఘటనలు హృదయాన్ని కలచి వేస్తున్నాయని తెలిపారు. రైతులకు కనీసం సాగు నీళ్లు ఇవ్వటం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావటం లేదని విమర్శలు గుప్పించారు.

## 27 వరకు తెలంగాణలో వానలే వానలు..

### ఈ జిల్లాల్లో దంచికొట్టనున్న వర్షాలు..



**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** తెలంగాణ ప్రజలు మొన్నటి వరకూ ఎండల బాధతో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. ఎండాకాలంలో కంటే ఇటీవలి కాలంలోనే అధికంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే గత రెండు రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు నమోదవుతున్నాయి. నిన్న హైదరాబాద్ లో భీకర వర్షం కురిసిన విషయం తెలిసిందే. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడిన క్రమంలో రాష్ట్రంలో వర్షాలకు అనుకూల పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. తెలంగాణలో ఈ నెల 27 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. సెప్టెంబర్ 21 ఉదయం 8 గంటల వరకు భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ తదితర జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వివరించింది. ఈ నెల 23 నుంచి 26 వరకు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సెప్టెంబర్ 22 న కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అటు బుధవారం మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం జిల్లాల్లోని అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక గురువారం ఆసీఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. అలాగే శుక్ర, శని వారాల్లోనూ తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయనిహెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ ను జారీ చేసింది.

## ఖైరతాబాద్ గణేష్ వద్ద పోటెత్తిన భక్తులు..

### కిటకిటలాడుతున్న క్యూలైన్లు..!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** హైదరాబాద్ గణేష్ నవ రాత్రి ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతు న్నాయి. ఎటు చూసిన గణేష్ మండపాలు.. ఆట పాటలతో నగరం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోతుంది. గల్లీ గల్లీకి గణేష్ మండపాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక హైదరాబాద్ అనగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది ఖైరతాబాద్ గణేష్.. ఈ ఏడాది ఖైరతాబాద్ లో కొలువుదీరిన 69 అడుగుల శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. వీకెండ్ కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తుతున్నారు. బడా గణేష్ దర్శనానికి 2 కిలోమీటర్ల మేర భక్తులు క్యూ కట్టారు. దాంతో మహాగణపతి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతుంది. అయితే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాటకు ఏ మాత్రం అవకాశం లేకుండా భక్తులను దర్శనానికి పంపిస్తున్నారు.ఇవాళ ఆదివారం సెలవు రోజు కావడంతో ఈ ఒక్కరోజే సుమారు లక్షన్నరకు పైగా భక్తులు బడా గణేష్ ను దర్శించుకునే అవకాశం ఉందని ఉత్సవ కమిటీ, అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం ఒక్కరోజే దాదాపు 2 లక్షల మందికి పైగా భక్తులు ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. మరోవైపు ఎండల కారణంగా నిన్న కొంత మంది భక్తులు క్యూలైన్లలోనే సొమ్మసిల్లి పడిపోయారు. దాంతో అక్కడే ఉన్న వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. మరికొంతమంది జనం ఒత్తిడితో ఉండలేక బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు వారికి సహకరించారు.చాలా మంది భక్తులు మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు, ఆర్టీసీ బస్సులు అలాగే ఆటోల్లో వస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ నుంచి మండపం వచ్చే దారిలో రద్దీ బాగా పెరిగిందన్నారు. ఆలయ ప్రాంగణమంతా సీసీ కెమెరాల నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. ఇక ఈ ఏడాది ఖైరతాబాద్ లో 69 అడుగుల ఎత్తులో శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి దర్శనమిస్తు న్నారు. బడా గణేష్ తో పాటు కాళికామాత, సోమనాథ్ జ్యోతిర్లింగం, విశ్వకర్మ ,విష్ణుమూర్తి రూపాలు ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

## ఎల్ నినో కంటే ఎల్ కాంగో ప్రమాదకరం

- రేవంత్ పాలనలో రాష్ట్రం అతలాకుతలం
- కల్లుతాగిన కోతుల్లా కాంగ్రెస్ ఎంపీల తీరు: ఆర్ఎస్పీ
- ప్రైవేట్ ఆస్తులపై దాడులు సిగ్గుచేటు
- పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే డైవర్షన్ రాజకీయాలు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి300 కోట్ల విలువైన భూకబ్జా
- రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు
- చోద్యం చూస్తున్న పోలీస్ బాస్
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** 'రాష్ట్ర రైతాంగాన్ని పట్టి పీడిస్తున్న ఎల్ నినో కంటే తెలంగాణను అతలాకుతలం చేస్తున్న ఎల్ కాంగో (కాంగ్రెస్ పాలన) అత్యంత ప్రమాదకరం. ఎల్ నినో 10 ఏండ్లకోసారి వచ్చి ఆగం చేస్తది. కానీ ఎల్ కాంగో రోజూ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతుంది. సంక్షేమాన్ని వదిలి ప్రజల బతుకులను చిన్నాభిన్నం చేస్తున్నది. ప్రజల భూములకు రక్షణ ఉండదు. మహిళల భద్రతకు భరోసా ఉండదు' అని ప్రభుత్వంపై, కాంగ్రెస్ నేతల వ్యవహారంపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ నేతలు కల్వకుర్తి శ్రీనివాస్, సాయితేజ, రాజు, బాధిత రైతు నరేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ఎంపీలు కల్లుతాగిన కోతుల్లా వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ పెద్దల దోపిడీ బండారం బట్టబయలు చేసిన బీఆర్ఎస్ నేతల ప్రైవేట్ ఆస్తులపై దాడులకు దిగుతున్నారని విమర్శించారు. 'గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని చంపేందుకు అరికెపూడి గాంధీ ఈ విధంగానే వారింటికి వెళ్లారు.ఇటీవల హరీశ్‌రావు వ్యవసాయ భూమిలోకి వెళ్లిన కాంగ్రెస్ నేతలకు 3,000 మంది పోలీసులతో రక్షణ కల్పించారు' అని ధ్వజమెత్తారు. ఎవరైనా అక్రమంగా ఆస్తులు సంపాదిస్తే ప్రభుత్వ సంస్థల ద్వారా విచారణ చేపట్టాల్సిన ప్రభుత్వ పెద్దలు, తెలంగాణను సాధించిన ఉద్యమకారుల ఇండ్లపై దాడులు చేయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు ప్రైవేట్ వ్యక్తుల ఇండ్లు, భూములపైకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.'పోలీస్ పహారాలో బీఆర్ఎస్ నేతల నివాసాలపై ఎంపీలు దాడులు చేస్తుంటే డీజీపీ ఏం చేస్తున్నారు? దాడులు చేస్తామని సోషల్ మీడియాలో ముందే ప్రకటించి వందలాది మందితో వెళ్తుంటే నిలువరించరా? అసలు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉన్నదా? నేను కూడా రేపు మీ ఇంటికో.. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికో రావచ్చా? ప్రజల ఇండ్లలోకి చొరబడితే ఊరుకుంటారా?' అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు. అసలు భూముల సర్వే చేయాల్సింది అధికారులా? అధికార పార్టీ ప్రజాప్రతినిధులా? అని నిలదీశారు. ఎనిమిది మంది చొప్పున కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణకు చేసిందేమీలేదని, తెచ్చిందీ ఏమీలేదని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు దిగజారాయని, రాష్ట్రం నేరాలు ఘోరాలకు అడ్డాగా మారిందని విమర్శించారు.

## ఆరు నెలల్లో ఆదుకోవాలని కాంగ్రెస్‌కు ఉద్యమకారుల అల్టిమేటం



హనుమకొండ చౌరస్తా : మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న, అమరులైన, జైళ్లకు వెళ్లిన వక్తులను శాస్త్రీయంగా గుర్తించి వారి కుటుంబాలను ఆరు నెలల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఉందనితెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్తె లిపారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు.ఆదివారం హనుమకొండ కాకతీయకాలనీ లోని ఉద్యమకారుల ఐక్య వేదిక కార్యాలయం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన 1969 తెలంగాణ ఉద్యమకారుడు రాపాక కొండయ్య అకాల మృతి పట్ల అతని ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన వ్యక్తుల జాబితాను పారదర్శకంగా చేపట్టడంతో పాటు వారి కుటుంబాల స్థితిగతులను తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుందని వెల్లడించారు.తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాల సంక్షేమం కోసం రానున్న రోజుల్లో తెలంగాణ ఉద్యకారులు ఐక్య వేదిక ఆధ్వర్యంలో టోల్ ఫ్రీ నెంబర్ ను అందుబాటులోకి తీసువస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17న వరంగల్ వేదికగా ప్రారంభమైన తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పుయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని బ్రహ్మరథం పడుతున్నారన్నారు.రాష్ట్ర సంక్షేమం కోసం కేటాయించే నిధుల్లో స్వరాష్ట్రం సాధన కోసం అసువులు బాసిన కుటుంబాలకు ఒకశాతం నిధులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తొలి దశ ఉద్యమకారుల కన్వీనర్ టీఎన్. స్వామి, ఓదార్పుయాత్ర రాష్ట్ర ఇన్‌చార్జి వొడపెల్లి శ్యాం కృష్ణ. కొండేటి నారాయణరెడ్డి, ఏ. తిరుపతిరెడ్డి, తౌటం సమ్మయ్య, వరంగల్ జిల్లా ఓదార్పు యాత్ర ప్రచార కమిటీ సభ్యులు చాంద్ పాషా , చెన్నూరి నటరాజ్, ఇమ్మడిశెట్టి రాజు, మేకల కృష్ణ, మాధవిలత, మీడియా ఇన్‌చార్జి రాంపెల్లి శ్రీనివాసచారి, రాంకుమార్, రాజు, రవీందర్, కృష్ణమూర్తి, సూరి, సాగర్, దేవేందర్‌రెడ్డి, స్వర్ణలత, పద్మ, అంజాద్, కిరణ్, చుంచు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్లో బీజేపీకి ఊహించని కొత్త ప్రత్యర్థి?

టీఎంసీ, కాంగ్రెస్, లెఫ్ట్ బలహీనపడ్డ వేళ..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** పశ్చిమ బెంగాల్లో ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. ముఖ్యంగా గతంలో తొలుత కాంగ్రెస్, ఆ తర్వాత లెఫ్ట్ బలహీనపడటంతో వరుసగా మూడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈసారి ఓటమితో పూర్తిగా పతనమైంది. ఇప్పుడు ఉనికికోసం పోరాడుతోంది. అదే సమయంలో తృణమూల్ ను చిత్తు చేసి సంచలనం సృష్టించిన బీజేపీకి (దీజీ) ఇక అంతా నల్లేరుపై నడకే అని అంతా భావిస్తున్న వేళ గతంలో ఎన్నడూ లేని విధంగా సరికొత్త ప్రత్యర్థి పుట్టుకురావడంతో పాటు పెను సవాల్ విసురుతోంది. బెంగాల్లో నాలుగు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీకి ఇప్పట్లో తిరుగులేదని అంతా భావిస్తున్న వేళ స్వయంకృతాలే సీఎం సువేందు అధికారికి శాపంగా మారిపోతున్నాయి. ఉత్తరాదిలో బీజేపీ బలపడేందుకు పనికొచ్చిన కొన్ని కారణాలు, ఇప్పుడు సువేందుకు బెంగాల్లో బలహీనపడేందుకు కారణంగా మారిపోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అందులో ప్రధానమైనది మాంసాహారం. బెంగాలీలకు ఎంతో ఇష్టమైన మాంసాహారాన్ని సనాతన ధర్మం పేరు చెప్పి వారికి దూరం చేసేందుకు సువేందు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు బ్యాక్ ఫైర్ అవుతున్నాయి. గతంలో ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనంలో గుడ్లను పూర్తిగా తొలగించి, ఇస్కాన్ సహకారంతో కేవలం శాకాహార భోజనాన్ని మాత్రమే పిల్లలకు అందించాలని సువేందు అధికారి తీసుకున్న నిర్ణయం తీవ్ర రాజకీయ దుమారాన్నే లేపింది. చివరకు తీవ్ర వ్యతిరేకత కారణంగా ప్రభుత్వం వారానికి రెండు రోజులు విడిగా గుడ్లు సరఫరా చేస్తామని ప్రకటించాల్సి వచ్చింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్ నుంచి సువేందు తీసుకొచ్చిన బాగేశ్వర్ బాబా పీఠాధిపతి ధీరేంద్ర కృష్ణ శాస్త్రి .. నవరాత్రుల వేళ మాంసాహారం తినడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ చేసిన వ్యాఖ్యలు సాధారణ బెంగాలీలలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించాయి. ఈ వ్యాఖ్యలు ప్రభుత్వం మెడకు చుట్టుకున్నాయి. అసలే బెంగాల్ చరిత్రలో ఆహారపు అలవాట్లు అనేవి కేవలం రుచికి సంబంధినవి కాకుండా, అక్కడి సంస్కృతి, సామాజిక జీవన విధానంలో విడదీయరాని భాగంగా ఉన్నాయి. దుర్గాపూజ సమయంలో రకరకాల రుచికరమైన మాంసాహార వంటకాలను ఆస్వాదించడం ఇక్కడి ప్రజలకు ఒక మతపరమైన ఆచారం కూడా. అయితే ఈ మధ్య కాలంలో వీహెచ్పీతో పాటు బాగేశ్వర్ బాబా చేస్తున్న వ్యాఖ్యలపై ప్రభుత్వం ప్రజలకు టార్గెట్ అవుతోంది. నవరాత్రుల పేరుతో తమ ఆహారపు అలవాట్లను తక్కువ చేసి మాట్లాడటం తమ ప్రాచీన సంస్కృతిని అవమానించడమేనని స్థానికులు బలంగా భావిస్తున్నారు. ఈ అలజడి క్రమంగా అధికార బీజేపీ ప్రయోజనాలకు గండికొట్టేలా కనిపిస్తోంది. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో వీటి ప్రభావం బీజేపీపై పడేలా కనిపిస్తోంది.



# కిమ్ మరో క్షిపణి ప్రయోగం..

## జపాన్, దక్షిణ కొరియాలో టెన్షన్!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** ఉత్తర కొరియా తూర్పు సముద్రంలోకి సరికొత్తగా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం తూర్పు ఆసియా ప్రాంతంలో కలకలం రేపింది. ఈ పరిణామంతో జపాన్, దక్షిణ కొరియాలు తమ నిఘా వ్యవహారాలను ముమ్మరం చేసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఉత్తర కొరియా ప్రయోగించిన ఈ బాలిస్టిక్ క్షిపణి కొరియా ద్వీపకల్పానికి తూర్పు సముద్ర భాగంలో పడిందని జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. జపాన్ జాతీయ ప్రసార సంస్థ కథనం ప్రకారం.. ఈ క్షిపణి జపాన్ ప్రత్యేక ఆర్థిక మండలి వెలుపల పడినప్పటికీ.. సమీపంలోని నౌకా మార్గాలు, ప్రాంతీయ భద్రతకు ముప్పు ఇంకా పొంచి ఉందనే భావన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ తీర్మానాల తిరస్కరణ ఈ క్షిపణి ప్రయోగానికి సరిగ్గా ఒకరోజు ముందు ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఉత్తరకొరియా తీవ్రంగా ఖండించి తిరస్కరించింది. తమ దేశపు అణు సామర్థ్యాన్ని, రక్షణ వ్యవస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ వీడేది లేదని, ఈ విషయంలో అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల గ్వామ్ సమీపంలో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలు కలిసి నిర్వహించిన త్రైపాక్షిక నావికా విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విన్యాసాలు తమ దేశ భద్రతకు ప్రత్యక్ష ముప్పు అని, ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయని ఆరోపించింది. కిమ్ సోదరి సెన్సేషనల్ కామెంట్స్ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ బహిరంగ ప్రకటన విడుదల చేస్తూ.. అమెరికా నేతృత్వంలో జరుగుతున్న సైనిక చర్యలు కొరియా ద్వీపకల్పంలో శాంతికి విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు. దేశ రక్షణ కోసం అణ్వాయుధాలను బలపరచడం, క్షిపణి వ్యవస్థలను విస్తరించడం తమ ప్రాథమిక హక్కు అని.. ఆ మార్గం నుంచి ఉత్తరకొరియా వెనక్కి తగ్గదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. భద్రతా సవాళ్లు, ప్రాంతీయ ప్రభావం ఈ వరుస క్షిపణి పరీక్షలు కేవలం సైనిక ప్రదర్శన మాత్రమే కాదని.. అంతర్జాతీయ సమాజం, శత్రు దేశాల ఒత్తిడికి ఉత్తర కొరియా ఇస్తున్న ప్రత్యక్ష ప్రతిస్పందన అని భద్రతా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితి ఫలితంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని ప్రధాన వాణిజ్య, నౌకా రవాణా మార్గాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం జపాన్, దక్షిణ కొరియాలు తమ రక్షణ సన్నాహాలను సమీక్షిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

# రష్యాపై కనీవినీ ఎరుగని భారీ దాడి : మాస్కోలో సైతం.. !!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** రష్యాపై ఉక్రెయిన్ ఇదివరకెప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి దిగింది. మాస్కోతో పాటు దేశంలోని అనేక కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని 1,000కి పైగా డ్రోన్లను ప్రయోగించింది. మాస్కో చరిత్రలోనే ఇది అత్యంత పెద్ద డ్రోన్ దాడిగా స్థానిక పాలనా యంత్రాంగం అభివర్ణించింది. రష్యా పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ నడుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యూహాత్మక దాడి చోటు చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించు కుంది. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. వాయుసేన, సరిహద్దు రక్షణ దళాలు సుమారు 1,100 ఉక్రేని యన్ డ్రోన్లను విజయవంతంగా కూల్చి వేశాయి. రష్యా ప్రధాన భూభాగంలోని వివిధ నగరాలతో పాటు క్రిమియా, బ్లాక్ సీ తీర ప్రాంతాలలో ఈ వైమానిక దాడులను తిప్పికొట్టినట్లు రష్యా సైనిక వర్గాలు తెలిపాయి. ఈ స్థాయిలో ఏకకాలంలో భారీ సంఖ్యలో డ్రోన్లు దూసుకురావడం రష్యా సైనిక రక్షణ వ్యూహాలకు అతిపెద్ద సవాల్ గా మారింది. ఈ విధ్వంసకర డ్రోన్ దాడులపై మాస్కో నగర మేయర్ సెర్గీ సోబ్యానిన్ స్పందించారు. తమ రాజధాని నగరం వైపు దూసుకొచ్చిన కనీసం 450 డ్రోన్లను గాల్లోనే కూల్చివేసినట్లు ప్రకటించారు. అయినప్పటికీ.. కొన్ని డ్రోన్లు రక్షణ వలయాన్ని ఛేదించుకుని మాస్కోలోని అత్యంత కీలకమైన ఆయిల్ రిఫైనరీ, ఓ రెసిడెన్షియల్ అపార్ట్మెంట్ ఢీకొట్టాయని చెప్పారు. ఈ ఘటనల వల్ల ఎంత మేర నష్టం సంభవించిందనే విషయంపై ఆరా తీస్తు న్నామని అన్నారు. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత మాస్కో ఈ స్థాయిలో భీకర వైమానిక దాడిని ఎదుర్కోవ డం ఇదే మొదటిసారి. సాధారణంగా సరిహద్దు ప్రాంతాలకే పరి మితం అయ్యే డ్రోన్ వ్యూహాన్ని.. ఈసారి ఉక్రెయిన్ నేరుగా రష్యా గుండెకాయలాంటి నగరాలకు విస్తరించింది. రష్యాలో మూడు రోజుల పాటు సాగిన ప్రతిష్టాత్మక పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ చివరి రోజైన ఆది వారం నాడే ఈ దాడులు జరిగాయి. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీ ఏదీ లేకుండానే ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. పుతిన్ నాయ కత్వాన్ని, క్రెమ్లిన్ సార్వభౌమత్వాన్ని మరింత బలోపేతం చేసే తరుణంలో ఉక్రెయిన్ ఈ తరహా భారీ ప్రతిఘటనకు దిగడం చర్చనీయాంశమైంది. భవిష్యత్తులో ఉక్రె యిన్ నుంచి వచ్చే ఇలాంటి అత్యాధునిక వైమానిక దాడులను నిలువరించేందుకు రష్యాతనభద్రతా వ్యూహాలను మరింత కఠినతరం చేసే అవకాశం ఉంది.






# గిలగిలా కొట్టుకుంటున్న పాక్!

- రాత్రి 9 గంటలకే బంద్, పెళ్లి భోజనాలపై రూల్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** పొరుగు దేశమైన పాకిస్థాన్ తీవ్ర ఇంధన కొరత, ఆర్థిక సంక్షోభంతో అల్లాడిపోతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, పెరుగుతున్న ఇంధన వ్యయం పాక్ ఎకానమీని చావుదెబ్బ కొట్టేస్తున్నాయి. ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి పాకిస్థాన్ ప్రభుత్వం అత్యంత కఠినమైన పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. దేశంలో ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ పలు కీలక నిబంధనలతో స్మార్ట్ లాక్ డౌన్ ను అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల ప్రకారం.. దేశవ్యాప్తంగా ఉన్న షాపింగ్ మాల్స్, మార్కెట్లను రాత్రి 9 గంటలకే మూసివేయాల్సి ఉంటుంది. అలాగే వివాహ వేడుకలు, ఫంక్షన్ హాళ్లను రాత్రి 10 గంటలకల్లా క్లోజ్ చేయాలని ఆదేశించింది. పెళ్లిళ్లకు వచ్చేవారికి విందులో కేవలం 'ఒకే ఒక్క వంటకం' మాత్రమే వడ్డించాలని స్పష్టమైన నిబంధన విధించింది. హోటళ్లు, రెస్టారెంట్లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే పనిచేయడానికి అనుమతినిచ్చారు. అయితే హోమ్ డెలివరీలు, టేక్ అవే సేవలకు ఈ సమయ వేళల నుంచి మినహాయింపు ఇచ్చారు. కేవలం సామాన్య ప్రజలపైనే కాకుండా ప్రభుత్వ యంత్రాంగంపై కూడా పాక్ సర్కార్ కఠిన ఆంక్షలు విధించింది. ప్రభుత్వ అధికారుల వాహనాలకు ఇచ్చే ఉచిత పెట్రోల్, డీజిల్ కోటాలో ఏకంగా 50 శాతం కోత విధిస్తున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడు నెలల పాటు విదేశీ పర్యటనలు, కొత్త వాహనాల కొనుగోలుపై సంపూర్ణ నిషేధం విధించింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష సమావేశాలకు బదులుగా టెలికాన్ఫరెన్స్ ద్వారా మాత్రమే సమీక్షలు నిర్వహించాలని, విదేశీ ప్రతినిధులు వస్తే తప్ప అధికారిక విందులు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడటంతో పాకిస్థాన్లో రోజువారీ ఇంధన ధరలను సమీక్షిస్తున్నారు. డీజిల్ ధరలు లీటరుకు రూ. 424 దాటిపోవడంతో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు కొంతవరకు ఊరట ఇచ్చేందుకు లీటరుపై రూ. 100 సబ్సిడీని ప్రకటించినప్పటికీ, పరిస్థితులు ఎంతవరకు సర్దుమణుగుతాయో చెప్పడం కష్టంగా మారింది. పాఠశాలల వేళల్లో మార్పులు, ఆఫీసుల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ తర్వాత కూడా పరిస్థితి మారకపోవడంతో ఈ కఠిన ఆంక్షలు అమలు చేయక తప్పడం లేదని విశ్లేషకులు చెబుతున్నారు.

# భారత్ పై చర్యలకు అమెరికన్ హౌస్..సై

- డొనాల్డ్ ట్రంప్‌కు సర్వాధికారాలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:** రష్యా నుంచి ముడి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటోన్న భారత్ సహా ఇతర దేశాలకు గట్టి షాక్ ఇచ్చింది అమెరికా. దీనికోసం ఓ నూతన చట్టాన్ని తీసుకొచ్చింది. ఆయా దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే దిగుమ తులపై ఏకంగా 100 శాతం వరకు టారిఫ్ విధించేలా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అపరిమిత అధికారాలు కల్పించే బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. రష్యా ఆయిల్ ను కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్ పై మాస్కో సాగిస్తున్న యుద్ధానికి పరోక్షంగా సహాయం అందిస్తున్నా యనేది అమెరికా వాదన. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో రష్యా నుంచి అత్యధిక మోతాదులో ఇంధనాన్ని చౌకగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి పాశ్చాత్య దేశాల ఏకపక్ష ఆంక్షలను ఏమాత్రం లెక్కచేయకుండా భారత్, చైనా.. రష్యా ముడి చమురు దిగుమతులను విపరీతంగా పెంచేశాయి. ఈ నేపథ్యంలో అమెరికా హౌస్ ఆఫ్ రెప్రెజెంటేటివ్ ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ పేరుతో ప్రతిపాదించిన ఈ బిల్లుపై యూఎస్ హౌస్ ఓటింగ్‌లో ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 214-211 ఓట్ల తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. మెజారిటీ రిపబ్లికన్ సభ్యులకు తోడుగా ఇద్దరు డెమొక్రాటిక్ ప్రజాప్రతిని ధులు కూడా మద్దతు పలికారు. దీంతో 214-211 ఓట్ల అతి తక్కువ తేడాతో ఈ ప్రతిపాదన తదుపరి దశకు చేరుకుంది. తుది నిర్ణయాత్మక ఓటింగ్ బుధవారం జరుగనుంది. ఒకవేళ ఈ బిల్లు చట్టరూపం దాల్చితే.. రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకుంటోన్న భారత్, చైనా, టర్కీ, అజర్ బైజాన్, హంగేరి, సింగపూర్, స్లోవాక్ రిపబ్లిక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కజకి స్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్ పై 100 శాతం టారిఫ్‌లను విధించడానికి డొనాల్డ్ ట్రంప్‌కు సర్వాధికారాలు లభిస్తాయి. దీనివల్ల ఆయా దేశాల నుంచి అమెరికాకు జరిగే ఎగుమతుల ధరలు భారీగా పెరిగిపోతాయి. ఈ బిల్లు ద్వారా రష్యా మాత్రమే కాకుండా ఇరాన్‌పై కూడా అత్యంత కఠినమైన ఆంక్షలను పొడిగించడానికి అమెరికా రంగం సిద్ధం చేసింది. 1996 నాటి ఇరాన్ ఆంక్షల చట్టాన్ని 2031 సంవత్సరం వరకు పొడిగించేలా, ఆ దేశ ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టే విదేశీ సంస్థలపై పెనాల్టీలు విధించేలా కఠిన మార్గదర్శకాలను ఇందులో పొందుపర్చారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయరాదంటూ అమెరికా గతంలోనే హెచ్చరించింది. దీన్ని పెద్దగా పట్టించుకోలేదు కేంద్రం. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులను భారీగా పెంచుకుంది. ఇప్పుడు అమెరికా ప్రతినిధుల సభ తీసుకునే తుది నిర్ణయం భారత్-అమెరికా దౌత్య ప్రయాణంలో కీలక మలుపుగా మారే అవకాశం లేకపోలేదు. దీనిపై డొనాల్డ్ ట్రంప్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశమౌతోంది.

# ఏపీకి కేంద్రం వరం..

## నాలుగు విమానాశ్రయాలకు అదనపు హంగులు!



ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం ఫోకస్ చేస్తుంది. రాష్ట్రంలోని విమానాశ్రయాలను మెరుగుపరచడం మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం పెరిగితే ప్రజలు సులభంగా ప్రయాణించగలుగుతారని భావించి, మెరుగైన సౌకర్యాల కల్పనకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. ఈ విమానాశ్రయాల అభివృద్ధికి మొత్తం రూ.912.94 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రన్‌వేలు విస్తరించడం, కొత్త టెర్మినల్ భవనాలు కట్టడం, అనుసంధాన రోడ్లు వేయడం, ప్రయాణికులకు అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతోంది. ఈ క్రమంలో విజయవాడ, తిరుపతిలో చేపట్టిన పనులు ఇప్పటికే చాలావరకు పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం, కడపలోని పనులు ఇంకా కొనసాగుతున్నాయి. విజయవాడ విమానాశ్రయంలో రూ.473 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం, టెక్నికల్ బ్లాక్ నిర్మాణం జరిగింది. ఇవి పూర్తయితే 16 వేల చదరపు మీటర్ల కొత్త భవనాలు అందుబాటులోకి వస్తాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ అభివృద్ధి అవసరంగా మారింది .రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ.173.28 కోట్లతో కొత్త డొమెస్టిక్ టెర్మినల్, ఇతర సదుపాయాలు నిర్మిస్తున్నారు. 91 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలినవి త్వరలో అయిపోతాయని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల సుమారు 21 వేల చదరపు మీటర్ల స్థలం అదనంగా లభిస్తుంది. తిరుపతి విమానాశ్రయంలో రూ.55.92 కోట్లతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, టెక్నికల్ బ్లాక్ నిర్మాణం పూర్తయ్యాయి. వీటిని త్వరలో ప్రారంభించాల్సి ఉంది. తిరుపతి నుంచి ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, బెళగావి, కొల్హాపూర్, శివమొగ్గ, విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గోవా వంటి చోట్లకు సర్వీసులు నడుస్తున్నాయి. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే మరిన్ని విమానాలు ప్రయాణికులకు సౌకర్యాలను అందించవచ్చు. దీంతో ప్రజలు సులభంగా, తక్కువ సమయంలో ప్రయాణించే అవకాశం పెరుగుతుంది. రాష్ట్రంలో విమానయాన రంగం మరింత బలపడుతుంది. ఇది మాత్రమే కాదు ఏపీలో ఏవియేషన్ అభివృద్ధికి కూడా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో విశేషమైన కృషి జరుగుతోంది.



# వేములవాడ రెండో కళ్యాణకట్టలో నాయీ బ్రాహ్మణుల నిరసన..

- దక్షిణ తీసుకున్నందుకు రూ.15 వేల జరిమానా విధించారంటూ ఆరోపణ..
- టికెట్‌పై రూ.15 కమిషన్ ఇవ్వాలని డిమాండ్..
- సమస్య పరిష్కరించకపోతే రెండు కళ్యాణకట్టలు బంద్ చేస్తామని హెచ్చరిక..




బలగం టీవీ, వేములవాడ:
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని రెండో కళ్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు శనివారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు తమను అనుమానాస్పదంగా చూస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణులు మాట్లాడుతూ.. కళ్యాణకట్టకు వచ్చే భక్తులు తలనీలాలు సమర్పించిన అనంతరం తమ ఇష్టపూర్వకంగా రూ.50, రూ.100 దక్షిణగా ఇస్తే మాత్రమే తాము స్వీకరిస్తున్నామని తెలిపారు. భక్తులు డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోతే తాము ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయడం లేదని స్పష్టం చేశారు.

**దక్షిణ విషయంలో వివాదం..**

రెండు రోజుల క్రితం వరంగల్‌కు చెందిన కొందరు భక్తులు తలనీలాలు సమర్పించుకున్న అనంతరం నాయీ బ్రాహ్మణులకు తమ ఇష్టపూర్వకంగా దక్షిణ ఇచ్చారని వారు తెలిపారు. ఈ సమయంలో ఆలయ ఏఈఓ భక్తుల వద్దకు వెళ్లి నాయీ బ్రాహ్మణులు డబ్బులు డిమాండ్ చేశారా అని ఆరా తీసి వీడియో చిత్రీకరించారని ఆరోపించారు. అనంతరం ఆ వీడియోను ఆలయ ఈఓకు అందజేసి, ముగ్గురు నాయీ బ్రాహ్మణులు ఒక్కొక్కరు రూ.15 వేల చొప్పున చెల్లించాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

**టికెట్‌పై రూ.15 కమిషన్ ఇవ్వాలని డిమాండ్..**

కళ్యాణకట్టలో తలనీలాల టికెట్ రుసుము రూ.50గా ఉందని, అందులో రూ.30 స్థానికంగా వంశపారం పర్యంగా విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులకు చెల్లిస్తుండగా, రూ.20 దేవస్థానం ఆదాయంలో జమ అవుతున్నట్లు వారు తెలిపారు.రెండో కళ్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులకు కూడా టికెట్‌పై కనీసం రూ.15 కమిషన్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సుమారు మూడు సంవత్సరాల క్రితం వేములవాడ రూరల్, అర్బన్ నాయీ బ్రాహ్మణ సంఘం తరఫున ప్రతిపాదన పంపామని, అది ప్రస్తుతం దేవాదాయ శాఖ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు.

**పదేళ్లుగా జీతం లేకుండా విధులు..**

దేవస్థానం నుంచి గానీ, కాంట్రాక్టర్ నుంచి గానీ ఎలాంటి జీతం లేదా కమిషన్ పొందకుండా సుమారు పదేళ్లుగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల మొక్కుబడులైన తలనీలాలు తీస్తూ విధులు నిర్వహిస్తున్నామని నాయీ బ్రాహ్మణులు తెలిపారు. భవిష్యత్తులో తమకు కూడా కమిషన్ అందుతుందనే ఆశతో ఇన్నాళ్లూ విధులు నిర్వహించామని చెప్పారు.అయితే భక్తులు ఇచ్చిన దక్షిణను స్వీకరించినందుకు రూ.15 వేల జరిమానా చెల్లించాలని ఒత్తిడి చేయడంతో పాటు, డబ్బులు చెల్లించకపోతే విధులకు రావద్దని అధికారులు చెబుతున్నారని వారు ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నందుకు నిరసనగా విధులను బహిష్కరించినట్లు తెలిపారు.

**రెండు కళ్యాణకట్టలకు మద్దతు..**

వేములవాడ దేవస్థానంలోని మొదటి కళ్యాణకట్టలో అనాదిగా పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కూడా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రెండో కళ్యాణకట్ట నాయీ బ్రాహ్మణులు తెలిపారు. పక్క రాష్ట్రాల్లోని దేవస్థానాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు జీతాలు అందుతున్నాయని, తమకు కూడా జీతాలు కల్పించాలని కోరారు.మొదటి కళ్యాణకట్ట నాయీ బ్రాహ్మణులకు జీతాలు కల్పించడంతో పాటు, రెండో కళ్యాణకట్టలో పనిచేస్తున్న తమకు టికెట్‌పై రూ.15 కమిషన్ ఇవ్వాలని దేవస్థానం అధికారులను కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే రెండు కళ్యాణకట్టలను సంయుక్తంగా బంద్ చేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.అదే సమయంలో ఆలయ అధికారులకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని, అధికారులు కూడా తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని నాయీ బ్రాహ్మణులు కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి నర్సయ్య, కళ్యాణ లక్ష్మణ్, గడ్డం తిరుపతి, గడ్డం నరేష్, తిరుపతి, ప్రదీప్, కమలాకర్, ఓరుగంటి శ్రీశైలం, శేఖర్, అవధూతల దామోదర్‌తో పాటు పలువురు నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

- అజీజ్‌నగర్ అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు
- కేటీఆర్ లీజు డ్రామాలు, బినామీ ఆస్తుల బాగోతం
- కాంగ్రెస్ క్షేత్రస్థాయి పర్యటనలు.. రాజకీయ ఉద్రిక్తతలు



తెలంగాణలో గత బీఆర్ఎస్ పాలనలో ఫామ్‌హౌస్‌ల సంస్కృతి విపరీతంగా పెరిగిపోయిందని, అజీజ్‌నగర్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో అనేక అక్రమాలు, రేవ్ పార్టీలు జరిగాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 'ఫామ్‌హౌస్ ఫైల్స్' నడుస్తున్నాయని, రంగనాయక సాగర్ నుంచి మొదలుపెట్టి ఎర్రవెల్లి, జన్వాడ, అజీజ్‌నగర్ వరకు ఉన్న ఫామ్‌హౌస్‌ల బాగోతాలను ప్రజల ముందుంచుతున్నామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ నేతలు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో పర్యటించి, ఫామ్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అజీజ్‌నగర్‌లోని ఆ ఫామ్‌హౌస్ అసైన్డ్ భూమి అని, 111 జీఓ పరిధిలో ఉన్న ఆ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకునే అధికారం రోహిత్ రెడ్డికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరోజు ఆగర్భ శ్రీమంతులం అంటారని, మరొక రోజు తమకు హైదరాబాద్‌లో ఇల్లు కూడా లేదని డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్.. సత్యం రామలింగరాజు కంపెనీ భూముల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, నార్సింగిలో ఉంటున్నానని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో ఈగల్ ఫోర్స్ దాడులు చేసి ఏం జరిగిందో అందరికీ తెలుసని, అమెరికాలో చదువుకుని వచ్చి కేటీఆర్ తెలంగాణలో నేర్పిన సంప్రదాయం ఇదేనా అని ప్రశ్నించారు.ఈ ఏడాది మార్చిలో పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో డ్రగ్స్ వ్యవహారం బట్టబయలైందని తెలిపారు. అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో డ్రగ్స్ తాగినట్టు తేలిందని, పైలట్ రోహిత్ రెడ్డి తమ్ముడు రితేష్ రెడ్డి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు చెందిన కేదార్ అనే వ్యక్తికి రూ.25 లక్షలు చెల్లించారని ఆరోపించారు. ఆ తర్వాత ఆ కేదార్ 2025లో దుబాయ్‌లో డ్రగ్ ఓవర్ డోస్‌తో మరణించాడని తెలిపారు. నార్త్ ఇండియాకు చెందిన ఆ వ్యక్తులతో వారికి ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్, రేవ్ పార్టీలకు అడ్డాలుగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తన ఫామ్‌హౌస్‌ను ప్రదీప్ రెడ్డి పేరు మీద రాయించి, ఆ భూములను తన భార్య, అత్త కుటుంబ సభ్యుల పేర్ల మీద మార్చుకున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ దందాల అసలు బాగోతం తెలంగాణ ప్రజలకు తెలియాలనే తాము క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని ఫామ్‌హౌస్‌ల పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకుల అసలు బండారం త్వరలోనే ప్రజల ముందు పూర్తిగా బయటపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా కుట్రలు

- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో సైతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

కాచిగూడ, సెప్టెంబర్ 20 : ప్రజాస్వామ్యానికి బీసీలే పునాదిరాళ్లు అని, అలాంటి బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అగ్రవర్ణాలు కుట్రలు పన్నుతున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. ఆదివారం కాచిగూడలో జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశానికి మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని శాసించేది రాజ్యాధికారం, డబ్బేనని, అవి ఉన్నవారే నేటి సమాజంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలు ఎదగకుండా కులాల వారీగా విభజించి అణగదొక్కుతున్నారని, అందుకు వ్యతిరేకంగా బీసీలంతా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. 'బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్‌ను తక్షణమే తొలగించాలి.కేంద్రస్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుచేయాలి' అని డిమాండ్ చేశారు. తెలంగాణ ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు దానకర్ణచారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రవికుమార్ ముదిరాజ్,




రామరాజ్, అల్లం యాదయ్య, చెన్నయ్య, జీ మల్లేశ్, సీ రామమూర్తి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్, నగేశ్‌రాజ్, గౌతం, నీలం వెంకటేశ్, సీ రాజేందర్, నిఖిల్ పాల్గొన్నారు.

## అటకెక్కిన చనాక-కొరాట..

- ట్రయల్ రన్‌కే పరిమితం
- జనవరిలో మోటర్లు ఆన్ చేసిన సీఎం
- 8 నెలలు దాటినా అడుగుపడని వైనం
- నీళ్లిచ్చి ఆదుకోవాలని రైతుల వేడుకోలు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 : సముద్రం తలాపున పెట్టుకొని చేప దూపకేడ్చినట్టుగా ఉన్నది ఆదిలాబాద్ జిల్లాలోని రైతుల దుస్థితి. జిల్లాలోని ఐదు మండలాల్లో 51 వేల ఎకరాలకు సాగునీరు అందించే చనాక–కొరాట ప్రాజెక్టు పిల్లకాలువ పనులు పూర్తికాకపోవడంతో నీరు అందక రైతులు పంటలు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొన్నది. రైతులకు సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం మహారాష్ట్ర సరిహద్దులోని జైనథ్ మండలం కొరాట వద్ద పెన్‌గంగా నదిపై చనాక–కొరాట ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మహారాష్ట్ర సీఎం, మంత్రులు, అధికారులతో చర్చలు జరిపారు. ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణానికి రెండు రాష్ట్రాలు ఆమోదం తెలిపాయి. మన రాష్ట్రంలోని భోరజ్ మండలం కొరాట వద్ద నిర్మించే బరాజ్, ప్రధాన కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.451.46 కోట్లు మంజూరు చేసింది. పంప్‌హౌస్ నిర్మాణ పనులకు రూ.118.92 కోట్లు కేటాయించింది. పెన్‌గంగ నీరు 0.98 టీఎంసీలను కొరాట వద్ద నిల్వ చేసేందుకు బరాజ్‌ను నిర్మించారు. రైతుల భూములకు సాగునీరు అందించడానికి 47 కిలోమీటర్ల ప్రధాన కాలువ, 129 బ్రిడ్జిలు నిర్మించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బరాజ్, పంప్‌హౌస్, ప్రధాన కాలువల పనులను పూర్తిచేయగా, డిస్ట్రిబ్యూటరీల కోసం భూ సేకరణ జరిపే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది.

## కేటీఆర్ చొరవతో దుబాయ్‌లో మృతి చెందిన తంగళ్లపల్లి వాసి రవి మృతదేహం స్వగ్రామానికి..



బలగం టీవీ, తంగళ్లపల్లి:
తంగళ్లపల్లి మండలానికి చెందిన ఓల్లపు రవి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లారు. అక్కడ అనారోగ్యానికి గురై అకస్మాత్తుగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించి, దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి రవి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు సహకరించారు.కేటీఆర్ చొరవతో అవసరమైన ప్రక్రియ పూర్తిచేసి రవి మృతదేహాన్ని స్వగ్రామమైన తంగళ్లపల్లికి తరలించారు. ఈరోజు తంగళ్లపల్లిలోని వడ్డెర కాలనీలో ఉన్న ఆయన నివాసానికి మృతదేహం చేరుకుంది.రవి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## టిమ్స్ ఆసుపత్రిలో చోరీ కలకలం..




### ఐదో అంతస్తులో గది తాళం పగులగొట్టి సామగ్రి చోరీ..

బలగం టీవీ, హైదరాబాద్:
సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రిలో చోరీ ఘటన కలకలం రేపింది. ఆసుపత్రి ఐదో అంతస్తులోని ఓ గది తాళాన్ని గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి లోపల ఉన్న విలువైన సామగ్రిని అపహరించినట్లు సమాచారం.చోరీ ఘటనను గుర్తించిన ఆసుపత్రి నిర్వాహకులు వెంటనే బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్న పోలీసులు, ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వరంగల్ ఎంజీఎంలో పైకప్పు పెచ్చులు ఊడి ముగ్గురికి గాయాలు..




బలగం టీవీ, వరంగల్:
వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో దయనీయ పరిస్థితులు వెలుగుచూశాయి. ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడి కింద పడటంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిలో జనగామ జిల్లాకు చెందిన మస్తాన్ (55), అతని అటెండర్లు ఎల్లమ్మ (50), ఓంకార (33) ఉన్నారు. గాయపడిన ముగ్గురూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి భవనాల భద్రతపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ప్రజా కళా జాతర కరపత్రం ఆవిష్కరించిన విమలక్క..




బలగం టీవీ, హైదరాబాద్, సెప్టెంబర్ 20:
ప్రజా కళా జాతర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్య క్షురాలు విమలక్క ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.'యాభై రెండేళ్ల అరుణోదయలో యాభై ఏళ్ల విమలక్క ప్రస్థానం' పేరుతో 50 గంటల పాటు నిరంతరంగా పాట, ఆట, మాటలతో ప్రజా కళా జాతరను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో బాగ్లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపం (అరుణోదయ నాగన్న ప్రాంగణం) లో ఈ కార్యక్రమం జరగనుంది.ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాతరలో ప్రజా కళా ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల సన్మానాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా కళా ఉద్యమానికి అందించిన సేవలను స్మరించుకుంటూ విమలక్క 50 ఏళ్ల కళా ప్రస్థానాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో నవ తెలంగాణ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి నవీన్ కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు ఏపూరి మల్సూర్, అనిత, రాకేష్ సౌమ్యతో పాటు ప్రజా సంఘాల నాయకులు, సాంస్కృతిక కార్యకర్తలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి..

## CINEMA

బంధాలపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల ప్రభావం మనుషుల మధ్య బంధాలపై కూడా పడుతోందని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడింది. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు కూడా తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొంది. కలిసి బయటకు వెళ్లిన సమయంలోనూ ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాల్లో కమ్యూనికేషన్ తగ్గిపోతోందని చెప్పింది. కాజల్ అగర్వాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ఈ సందర్భంగా పంచుకుంది. తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి ప్రతి వారం కనీసం ఒకరోజు డిన్నర్‌కు బయటకు వెళ్తామని ఆమె తెలిపింది. ఆ సమయంలో ఇద్దరం ఫోన్లను పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, కలిసి సమయం గడపడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది.ప్రస్తుతం చాలా మంది జంటలు కలిసి ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం కేటాయించడం లేదని కాజల్ పేర్కొంది. డిన్నర్ డేట్‌కు వెళ్లినా చేతిలో ఫోన్ పట్టుకుని సోషల్ మీడియా చూస్తూ ఉండటం వల్ల పక్కనే ఉన్న వ్యక్తితోనే దూరం పెరుగుతోందని ఆమె అభిప్రాయపడింది. భార్యాభర్తల మధ్య మంచి అనుబంధం కొనసాగాలంటే ఒకరి అభిప్రాయాలను మరొకరు వినడం, మాట్లాడుకోవడం చాలా ముఖ్యమని కాజల్ సూచించింది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ భాగస్వామితో కొంత సమయం గడపడం, తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకోవడం అవసరమని చెప్పింది. తన వివాహ బంధంలో తాము పాటిస్తున్న ఈ విధానం గురించి చెబుతూ.. వారానికి ఒకరోజు ఫోన్‌లకు దూరంగా కలిసి సమయం గడపడం తమకు ఉపయోగపడుతోందని కాజల్ వెల్లడించింది. డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే నిజ జీవితంలో మన చుట్టూ ఉన్న వ్యక్తులతో మాట్లాడటం, వారి మాటలు వినడం ముఖ్యమనే సందేశాన్ని ఆమె ఇచ్చింది.కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలతో పాటు సాధారణ కుటుంబాల్లోనూ స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆమె చెప్పిన మాటలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.ఇదిలా ఉంటే.. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉంది. ఆమె నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవల ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమాలో కాజల్ న్యాయవాది పాత్రలో కనిపించింది. ఆహార కల్తీ, వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం వంటి అంశాల చుట్టూ ఈ సినిమా కథ కొనసాగుతుంది.





## నా కెరీర్‌లోనే ఎక్కువ కష్టపడ్డ సినిమా 'మైసా'

"మైసా' నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా. తొలిసారి యాక్షన్ జానర్‌లో నటించాను. ఏదో ఒకటి కొత్తగా చేయాలని తపన నాకు మొదట్నుంచీ ఉండేది. ఈ సినిమా కోసం దర్శకుడు నాతో చాలా సాహసాలు చేయించాడు. రియాలిటీ కోసం చాలా కష్టపెట్టాడు. వాటర్ ఫాల్స్‌లో జంప్ చేయించాడు. ఎనిమిది గంటలు అండర్‌వాటర్ యాక్షన్ సీన్స్ చేయించాడు. ఈ సినిమా కోసం డ్యాన్స్ చేస్తూ హిప్ బోన్ బ్రేక్ అయింది.మొత్తంగా నేను ఇంత కష్టపడ్డ సినిమా మరొకటి లేదు. టీజర్ మీకు నచ్చిందనుకుంటున్నా. సినిమా కూడా మీకు నచ్చుతుంది' అని అగ్ర కథానాయిక రష్మిక నమ్మకం వెలిబుచ్చారు. ఆమె ప్రధాన పాత్ర పోషించిన యాక్షన్ డ్రామా 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అజయ్ సాయిపురెడ్డి, అనిల్ సయ్యపురెడ్డి, వీరసాయి గోప నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 27న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రష్మిక మాట్లాడారు.'గోండు ట్రైబ్ కాన్సెప్ట్ ఇది. ఇందులో గోండు తెగ చేసే గుస్సాడియా దీక్ష చాలా కీలకం. దాన్ని వాస్తవికతకు అద్దంపట్టేలా చూపించాం. ఈ కథ రాసుకున్నప్పుడే రష్మిక అని ఫిక్సయిపోయా. ఇందులో కొత్త రష్మికను ప్రేక్షకులు చూస్తారు' అని దర్శకుడు రవీంద్ర పుల్లె చెప్పారు. ఇంకా నిర్మాత అజయ్ సాయిపురెడ్డి కూడా మాట్లాడారు.

## ఆ హీరోయిన్‌కి ఉదయభాను డబ్బింగ్



### . ఆ తర్వాత ఏం జరిగిందో రివీల్ చేసిన యాంకరమ్మ

తెలుగు సినీ పరిశ్రమలో ఇతర భాషల కథానాయికలకు మన తెలుగు నటీమణులు, యాంకర్లు, గాయకులు డబ్బింగ్ చెప్పడం సాధారణమే. అయితే కొన్ని సందర్భాల్లో తాము డబ్బింగ్ చెప్పిన విషయం కూడా ప్రేక్షకులకు తెలియకుండా పోతుంది. తాజాగా సీనియర్ యాంకర్, నటి ఉదయభాను తనకు సంబంధించిన అలాంటి ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ యాంకర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఉదయభాను.. యాంకరింగ్‌తో పాటు నటిగా కూడా పలు సినిమాల్లో కనిపించింది. ఆ తర్వాత వివాహం, పిల్లల కారణంగా కొంతకాలం కెరీర్‌కు దూరంగా ఉంది. ప్రస్తుతం మళ్లీ నటిగా రీఎంట్రీ ఇచ్చిన ఆమె.. మరోవైపు నిర్మాతగానూ వ్యవహరిస్తోంది. తాను నిర్మించిన 'పంచనామా' సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన డబ్బింగ్ కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించింది.తాను ప్రముఖ నటి ఛార్మికి 'శ్రీ ఆంజనేయం' సినిమాలో డబ్బింగ్ చెప్పినట్లు ఉదయభాను తెలిపింది. అయితే ఛార్మి మాట్లాడే విధానాన్ని అనుకరిస్తూ, తన గొంతును కూడా మార్చుకుని డబ్బింగ్ చెప్పానని చెప్పింది. దీంతో ఆ సినిమాలో ఛార్మికి తాను డబ్బింగ్ చెప్పిన విషయం ప్రేక్షకులకు తెలియలేదని వెల్లడించింది. ఛార్మికి 'శ్రీ ఆంజనేయం' సినిమాలో డబ్బింగ్ చెప్పాను. ఆమె మాట్లాడే విధానాన్ని ఇమిటేట్ చేస్తూ డబ్బింగ్ చెప్పాను. ఆమె కొన్ని పదాలను ప్రత్యేకంగా పలుకుతుంది. అలాగే నా గొంతును కూడా మార్చుకుని చెప్పడంతో.. ఆ సినిమాకు నేను డబ్బింగ్ చెప్పానని ఎవరూ గుర్తించలేకపోయారు అని ఉదయభాను చెప్పింది. అంతేకాదు, ఆ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ క్రెడిట్స్‌లో కూడా తన పేరు లేదని ఆమె పేర్కొంది. అందువల్ల తాను ఛార్మికి డబ్బింగ్ చెప్పిన విషయం బయటకు తెలియలేదని తెలిపింది.ఆ తర్వాత కూడా తనకు చాలామంది డబ్బింగ్ అవకాశాలు ఇచ్చేందుకు సంప్రదించారని, అయితే ఒక్కో పాత్రకు నాలుగు, ఐదు రోజుల సమయం కేటాయించాల్సి వచ్చేదని చెప్పింది. అప్పట్లో తనకు అంత సమయం, ఓపిక లేకపోవడంతో డబ్బింగ్ చెప్పడం కొనసాగించలేదని ఉదయభాను వెల్లడించింది. ఇలా 'శ్రీ ఆంజనేయం' సినిమాలో ఛార్మికి తానే డబ్బింగ్ చెప్పిన విషయాన్ని ఇన్నేళ్ల తర్వాత బయటపెట్టింది.కాగా, 'శ్రీ ఆంజనేయం' చిత్రానికి కృష్ణవంశీ దర్శకత్వం వహించారు. అయితే తనకు డబ్బింగ్ క్రెడిట్ ఇవ్వలేదని ఉదయభాను చేసిన వ్యాఖ్యలపై దర్శకుడు కృష్ణవంశీ ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## కాకా అలియాస్ కదిరి కాళిదాస్



అగ్ర కథానాయకుడు చిరంజీవి హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి 'కాకా' అనే పేరును ఖరారు చేసిన విషయం తెలిసిందే. టైటిల్ విడుదలైన నాటి నుంచి 'కాకా' అనే పేరుపై చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా చిన్నాన్నని 'కాకా..' అని పిలవడం రివాజు. ఇందులో అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. బహుశా అనస్వరకు ఇందులో చిరంజీవి చిన్నాన్న అయ్యుండొచ్చు.. అందుకే ఈ సినిమాకు 'కాకా' అని పేరు పెట్టారు అని కూడా చాలామంది అనుకున్నారు.అయితే.. ఈ వాదనలన్నింటికీ తెరదించుతూ.. 'కాకా' అనే పేరు ఈ సినిమాకు పెట్టడంలోని ఆంతర్యాన్ని హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రైవేటు ఈవెంట్‌లో చిరంజీవి బహిర్గతం చేశారు. 'కాకా అంటే.. కదిరి కాళిదాస్.. అని అర్థం' అని చిరంజీవి అసలు విషయం చెప్పేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాగే దీనిని మేకర్స్ కూడా షేర్ చేయడం విశేషం. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

## ఒకేచోట చేరిన అక్కినేని ఫ్యామిలీ..



### ఏఎన్ఆర్ జయంతి వేడుకల్లో అద్భుతమైన సందడి!

అక్కినేని కుటుంబం తాజాగా ఒకే వేదికపైకి చేరి సందడి చేసింది. లెజెండరీ నటుడు, అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒక్కచోట కలుసుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన ఫొటోను అక్కినేని నాగార్జున సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. ప్రస్తుతం ఈ ఫొటో విపరీతంగా వైరల్ అవుతుంది.సినీ ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు ఉన్న అక్కినేని కుటుంబం, ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఇలాంటి ప్రత్యేక సందర్భాలలో మాత్రం అందరూ కలిసి వేడుకలను జరుపుకోవడం ఎప్పుడూ విశేషమే. ఈ సమావేశంలో అక్కినేని నాగార్జునతో పాటు కుటుంబంలోని ఇతర ప్రముఖ సభ్యులు కూడా పాల్గొని, ఏఎన్ఆర్ జ్ఞాపకాలను నెమరువేసుకున్నట్లు తెలుస్తోంది. దిగ్గజ నటుడి జయంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులందరూ కలిసి ఆత్మీయంగా గడపడం, ఆయనకు ఘన నివాళులు అర్పించడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'ది ప్యారడైజ్' టికెట్ ధరల పెంపు

### స్పెషల్ ప్రీమియర్‌కీ గ్రీన్ సిగ్నల్




ఈ నెల 24న విడుదల కానున్న అగ్ర కథానాయకుడు నాని పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'కి టికెట్ ధరలను పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. అంతేకాదు, సెప్టెంబర్ 23 సాయంత్రం 6.30 నిమిషాలకు ఈ సినిమా ప్రీమియర్‌కు కూడా అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.500గా నిర్ణయించారు.ఇక సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఈ నెల 24 నుంచి 27 వరకూ ప్రస్తుత టికెట్ ధరకు అదనంగా జీఎస్టీతో కలిపి రూ.48, అదే తేదీల్లో మల్టీప్లెక్సుల్లో రూ.94 పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. రోజుకు ఐదు షోలు ప్రదర్శించేందుకు కూడా అనుమతినిచ్చారు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీకి సదరు చిత్ర నిర్మాణ సంస్థ శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ.. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం కోటి రూపాయలను అందజేసినట్టు తెలిసింది.